క్లుప్తంగా

తక్కువ ఖర్చుకు వైద్యం అందించడమే లక్ష్యం



ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఒంగోలు టౌన్: నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ క్యాంపు నిర్వహణ కమిటీ కన్వీనర్ మాదాల వెంకటరావు తెలిపారు. ఆదివారం నగరంలోని సంతపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య సేవలు అందించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన 1,708 మందికి వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యం ఖరీదై పేదలకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా వేల రూపాయల ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలోనే తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ శిబిరంలో నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు బి.హరిబాబు, ఎల్.ఎస్.రిచర్డ్స్, చాపల వంశీకృష్ణ, ఎస్.సందీప్ ప్రకాశ్, రంజిత్ బాషా, యం.శరత్, సుందర్‌బాబు వైద్య సేవలు అందించగా, చైతన్య నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ప్రజా సంఘాల కార్యకర్తలు, వలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందించారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం ఖాదరున్నీసాబేగం

సీఎస్‌పురం(పామూరు): పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తాచాటాలని హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం అన్నారు. సీఎస్‌పురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం పాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి రానున్న 15 రోజుల్లో ఒక ప్రణాళికా ప్రకారం చదివి మెరుగైన ఫలితాలు, మార్కులు రాబట్టాలన్నారు. ఇప్పటికే విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని చదివిస్తున్నామని, రానున్న రోజులు మరింత పకడ్బందీగా విద్యాభ్యాసం చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాముల పాటి వెంకటనరసయ్య, బొబ్బూరి రమేష్, పఠాన్ ఖాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన చీమకుర్తి అర్బన్ హెల్త్ క్లినిక్ భవనం

కూటమి పాపం.. రోగులకు శాపం..!

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 90 శాతం పూర్తయిన చీమకుర్తి అర్బన్ హెల్త్ క్లినిక్
- కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలైనా మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయని వైనం
- వైఎస్సార్ సీపీకి పేరు వస్తుందనే కుట్రతో పనులు నిలిపివేసిన కూటమి పాలకులు
- అద్దె భవనంలో అరకొర వసతులతో కొనసాగుతున్న అర్బన్ హెల్త్ క్లినిక్
- మెరుగైన వైద్య సేవలు అందక రోగులకు అవస్థలు

చీమకుర్తి రూరల్:

గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి గ్రామంలో అవసరమైన అన్ని ప్రభుత్వ భవనాలను నిర్మించి పల్లె ప్రజలకు మెరుగైన సేవలు అందించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లకు సొంత భవన నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టి దాదాపు పూర్తి చేశారు. కొన్ని భవనాలు నూరుశాతం పూర్తయి ప్రారంభానికి నోచుకోగా, మరికొన్ని భవన నిర్మాణాల పనులు చివరి దశలో ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనప్పటికీ.. 90 శాతం పనులు పూర్తయిన ప్రభుత్వ భవన నిర్మాణాలను సైతం పట్టించుకోకుండా వదిలేసింది. కేవలం మిగిలిన 10 శాతం పనులు పూర్తిచేసి ప్రారంభిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడే భవనాలను సైతం నిర్లక్ష్యం చేయడాన్ని చూస్తుంటే.. వాటిని నిర్మించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజల్లో మంచిపేరు వస్తుందేమోనని కుట్రపూరితంగా నిలిపివేసినట్లుందని పలువురు విమర్శిస్తున్నారు. అలాంటి వాటిలో చీమకుర్తిలోని అర్బన్ హెల్త్ క్లినిక్ భవనం ఉండటంతో.. చివరికి వైద్య రంగాన్ని కూడా కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా నిర్లక్ష్యం చేస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నచిన్న పనులు కూడా పూర్తి చేయలేక చంద్రబాబు సర్కార్ చతికిలపడిందంటూ ఎద్దేవా చేస్తున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న చీమకుర్తి అర్బన్ హెల్త్ క్లినిక్

రూ.80 లక్షలతో పనులు పూర్తిచేసిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం...

చీమకుర్తి పట్టణంలోని అర్బన్ హెల్త్ క్లినిక్ భవనం నిర్మాణ పనులు రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే అర్ధంతరంగా నిలిచిపోయాయి. అద్దె భవనంలో కొనసాగుతున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర వసతులే ఉన్నాయి. దీంతో రోగులకు నాణ్యమైన వైద్యం అందక చిన్నచిన్న అనారోగ్య సమస్యలకు కూడా ఒంగోలు, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. చీమకుర్తి నగర పంచాయతీ పరిధిలోని జనాభాకు ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు ఉన్న ఏకైక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నిధులను ఫస్ట్ ఫేజ్లో రూ.80 లక్షలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో దాదాపు గత వైఎస్సార్ సీపీ పాలనలోనే మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అర్బన్ అండ్ డెవలప్మెంట్ డిపార్ట్‌మెంట్ వారు 90 శాతం పనులు పూర్తి చేశారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. సాధారణ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో మిగిలిన 10 శాతం పనులైన ఎలక్ట్రికల్ వర్క్స్, పెయింటింగ్, ఫర్నిచర్ వంటి పనులు పట్టించుకునేవారు లేక తొమ్మిది నెలలుగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వ చేతగానితనంతో నేటికీ అసంపూర్తిగానే ఆ భవనం ఉండిపోయింది. ఇలాగే శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సెకండ్ ఫేజ్‌లో రూ.27 లక్షలు మంజూరు

ఫస్ట్ ఫేజ్‌లో చీమకుర్తి అర్బన్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరవగా 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన 10 శాతం ఎలక్ట్రికల్ వర్క్స్, పెయింటింగ్, ఫర్నిచర్ పనులకు సెకండ్ ఫేజ్‌లో రూ.27 లక్షల నిధులు మంజూరయ్యాయి. మిగిలిన పనులను త్వరగా పూర్తిచేసి సంబంధిత ఆరోగ్యశాఖ వారికి భవనాన్ని స్వాధీనం చేస్తాం.

– మురికిపూడి మరియదాసు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్, చీమకుర్తి

చొరవ చూపని కూటమి ప్రభుత్వం



గత ప్రభుత్వంలో చీమకుర్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు నిలిచిపోయి ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలిన నిర్మాణాలు పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలి.

– గోపురపు పూర్ణచంద్రరావు, చీమకుర్తి

అభివృద్ధిని గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



రెడ్ బుక్ రాజ్యాంగం తప్ప అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అసంపూర్తిగా మిగిలిపోయిన చీమకుర్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– పాటిబండ్ల గంగయ్య, కౌన్సిలర్, చీమకుర్తి

రామతీర్థంలో బూచేపల్లి కుటుంబం పొంగళ్లు



పూజలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి రూరల్: మండలంలోని రామతీర్థం పుణ్యక్షేత్రంలో గల గంగమ్మ దేవస్థానంలో బూచేపల్లి కుటుంబం ఆదివారం మొక్కుబడి చెల్లించుకుంది. శ్రీ సూర్య గ్రానైట్ పొంగళ్ల సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ముందుగా మోక్షరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం గంగమ్మ దేవస్థానంలో మొక్కుబడి చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ మన్నం శ్రీధర్‌బాబు, వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, సూర్యచంద్రరావు, మస్తాన్‌రెడ్డి, వెంకారెడ్డి, కత్తి రమణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, రాఘవరెడ్డి, కౌన్సిలర్లు, పాటిబండ్ల గంగయ్య, బెల్లం వెంకటరావు, పూర్ణచంద్రరావు, శేషాద్రి, సుందరరామిరెడ్డి, ఖాజా, బాబూరావు, సురేష్, శేషురెడ్డి, రాజేంద్ర సంతోష్, సర్పంచులు, ఎంపీటీసీలు, శ్రీ సూర్య గ్రానైట్ వర్కర్స్, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మాదిగ అమరవీరుల దినోత్సవం



సంతనూతలపాడు: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సంతనూతలపాడు: ఎంఆర్‌పీఎస్ సంతనూతలపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని చిలకపాడు గ్రామంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులడు తొరటి ఆనంద్‌మాదిగ మాట్లాడుతూ మాదిగ అమరవీరుల త్యాగాన్ని వృథా చేయకుండా యావత్ మాదిగ జాతి గుర్తుంచుకోవాలని తెలిపారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సేవలను పలువురు కొనియాడారు. సమాజంలోని అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన మంద కృష్ణమాదిగ నాయకత్వంలో పనిచేయడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నేతలు పాలపర్తి శ్రీను మాదిగ, అట్లూరి అశోక్ కుమార్ మాదిగ, అట్లూరి బిక్షాలు మాదిగ, బుడంగుంట నాగేశ్వరరావు మాదిగ, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు పాలపర్తి రవికుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరులకు నివాళి

చీమకుర్తి: మాదిగ అమరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆదివారం చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంఆర్‌పీఎస్ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. చీమకుర్తి క్రిస్టియన్‌పాలెం నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం వర్గీకరణ పోరులో అమరులైన మాదిగలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ సంఘాల నాయకులు తొరటి ఆనంద్, బొంతా ఏసుదాసు, జడ విజయ కుమార్, పాటిబండ్ల జక్రయ్య, కర్నా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



చీమకుర్తి: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

నేషనల్ బుక్ ట్రస్ట్ సేవలు నిరుపమానం



వాయల విజయరత్నంను సత్కరిస్తున్న అనపర్తి కృష్ణఫర్, తదితరులు

ఒంగోలు మెట్రో: సాహిత్యం, సంస్కృతి, చరిత్ర ప్రచురణలో నేషనల్ బుక్ ట్రస్ట్ చేస్తున్న సేవలు నిరుపమానమైనవని ఆంధ్రకేసరి విద్యా కేంద్రం కరస్పాండెంట్ చెంచురామయ్య అన్నారు. జానుడి సెంటర్ ఫర్ లిటరేచర్ అండ్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు లెక్చరర్స్ అండ్ టీచర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు అంజయ్య రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్స్‌లో ఆదివారం ఉపాధ్యాయిని చిలకమర్తి పద్మజ అనువదించిన ఫలహారాల చెట్టు బాలల సాహిత్యం, ఎస్ఎన్ఆర్ కిక్స్ అనే స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సభకు జానుడి సాహితీ సంస్థ డెరైక్టర్, న్యాయవాది డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా చెంచురామయ్య, విద్యావేత్త డాక్టర్ షాకీర్ పాల్గొని పుస్తకాలను ఆవిష్కరించి ప్రసంగించారు. స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ షాకీర్ మాట్లాడుతూ ప్రపంచంతో మనల్ని అనుసంధానం చేసే భాష ఇంగ్లిషు అని, ప్రతి ఒక్కరూ ఇంగ్లిషులో పట్టు సాధించాలని కోరారు. ఫలహారాలు చెట్టు పుస్తకంపై కథా రచయిత వెపైస్ దిగ్విజయ్ సమీక్షించారు. ఒకేషనల్ జూనియర్ కాలేజెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎంపికైన శ్రీనిధి ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరెస్పాండెంట్ వాయల విజయరత్నం, జేకే ఒకేషనల్ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ అనపర్తి కృష్ణఫర్, ఎంఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సంచాలకులుగా లెక్చరర్లు జాన్ శామ్యూల్, ఏ బ్రహ్మయ్య, దారా మోహన్‌రావు వ్యవహరించగా, మహేశ్వరచారి, రామ సుబ్బారావు, సాయి రాజేష్, వెంకటేశ్వర్లు, సాల్మన్, జాలాది మోహన్, పలువురు సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు గోవిందమ్మ



కనపర్తి గోవిందమ్మ

పొన్నలూరు: ఎన్నికల సమయంలో ప్రజలు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు కనపర్తి గోవిందమ్మ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. మహాశక్తి పథకం ద్వారా ప్రతి మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా వాటి సంగతే మర్చిపోయారన్నారు. తల్లికి వందనం, ఏడాదికి మూడు ఫ్రీ గ్యాస్ సిలిండర్ల పథకాలకు కూడా అరకొర నిధులు కేటాయించి దగా చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేసి మాట నిలబెట్టుకున్న చరిత్ర సీఎం చంద్రబాబుకు లేదన్నారు. అధికారం కోసం ప్రజలకు అబద్ధపు వాగ్దానాలు చేసి అధికారం వచ్చిన తరువాత వాటిని పట్టించుకోకపోవడం సీఎం చంద్రబాబు నైజమన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకపోతే ప్రశ్నిస్తానన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సీఎం చంద్రబాబుకు భజన చేయడం తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. అర్హులందరికీ ఉచిత సిలిండర్లు ఉత్తి మాటేనన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయంభ్రాంతులకు గురిచేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారు తప్ప ప్రజలకు, మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పథకాలు ఇవ్వకూడదని, వారికి ఎలాంటి పనులు చేయకూడదని పబ్లిక్‌గా సీఎం చంద్రబాబు చెప్పడం రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత రాజకీయ బేధాలు లేకుండా అందరికీ నవరత్న పథకాలను అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వ చేష్టలను, రాజకీయ దాడులను ప్రజలను గమనిస్తున్నారని, సరైన సమయంలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

9న సీవీఎన్ రీడింగ్ రూమ్ పాలకమండలి ఎన్నికలు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వెంకట సుబ్బారావు

ఒంగోలు మెట్రో: స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 9వ తేదీ రీడింగ్ రూంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి చిల్లర వెంకట సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఉదయం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. 9వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. అదేరోజు మధ్యాహ్నం నాలుగు గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికలలో రెండు ప్యానల్స్ తరఫున పోటీదారులున్నట్లు తెలిపారు. ఆంధ్రకేసరి ప్యానల్, మహాత్మా గాంధీ ప్యానల్ తరఫున పోటీదారులు ఉన్నారని, వీరు కాకుండా స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారని అన్నారు. మొత్తం 29 మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శి, ఈసీ మెంబర్లను ఓటర్లు ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం జీవితకాల సభ్యులతో కలిపి మొత్తం 970 మంది ఓటర్లున్నట్లు తెలిపారు. ప్రతి ఓటరు తప్పనిసరిగా క్లబ్ నుంచి జారీ చేసిన గుర్తింపుకార్డుతో పాటు ఆధార్‌కార్డ్ తీసుకురావాలన్నారు. ఎన్నికల కోసం రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. షటిల్‌కోర్టులో ఒకటి, క్యారమ్స్‌కోర్టులో ఒకటి చొప్పున పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశామని వెంకట సుబ్బారావు తెలిపారు. ప్రతి ఓటరుకు బ్యాలెట్ పేపర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే, ఈసీ మెంబర్లలో కేవలం ఆరుగురికి మాత్రమే ఓటు వేయాలని, అంతకన్నా ఎక్కువ మందికి ఓటు వేస్తే ఆ ఓటు చెల్లదని ఆయన పేర్కొన్నారు. సీవీఎన్ క్లబ్ బయట ఏర్పాటు చేసే టెంట్లలో మాత్రమే ఓటర్లు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఉండాలన్నారు. కేవలం ఓటర్లను ఎన్నికల సమయంలోనే క్లబ్ లోపలికి అనుమతిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులు కనమాల రాఘవులు, వారణాసి శ్రీనివాసశాస్త్రి, అంగలకుర్తి ప్రసాదు, చిల్లర నందకిషోర్, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

'అపూర్వ' సమ్మేళనం

పొన్నలూరు: మండలంలోని చెరువుకొమ్ముపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం మళ్లీ అదే పాఠశాల్లో కలుసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు అప్పటి విద్యార్థుల్లోని కనపర్తి మోహన్, ఉప్పటూరి మల్లీశ్వరి, మడతల పుష్ప చొరవ తీసుకొని ముందుకు వచ్చి తమతో చదువుకున్న విద్యార్థులతో సంప్రదింపులు చేసి ఒకచోటకు తీసుకొచ్చారు. ఈ ఆత్మీయ కలయిక ఒకరికొకరు ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. 2014–15 పదవ తరగతి చదివిన వీరంతా పాఠశాల్లో కలుసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు విచ్చేసి తమకు విద్యా బోధన చేసిన గురువులకు ఘనంగా స్వాగతం పలికారు. పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకొని అప్పటి హెచ్‌ఎం డీఎస్‌కేవీ ప్రసాదరావుతో పాటు ఉపాధ్యాయులకు పాదాభివందన చేసి ఘనంగా సన్మానించి జ్ఞాపకలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం, గోపూజ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ పంచామృతాలతో స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం చేశారు. గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మనేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు పాల్గొన్నారు.



అభిషేకం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

రంగారాయుడు చెరువు వద్ద ఉచిత వైద్య శిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

ఒంగోలు టౌన్: నగరంలోని రంగారాయుడు చెరువు వద్ద ప్రతి నెలా మొదటి ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకుడు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. అందులో భాగంగా రంగారాయుడు చెరువు వాకర్స్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో 320 మందికిపైగా రక్తపోటు, షుగర్, ఎముకల పటుత్వ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు చాపల వంశీకృష్ణ, జనరల్ వైద్యులు కొప్పోలు సౌమిత్ర పల్లవ్, నర్సింగ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, మేనేజర్ ప్రవీణ్ కుమార్, వాకర్స్ క్లబ్ కార్యదర్శి దేసు కాశీవిశ్వనాథ్, క్లబ్ సభ్యులు కోటిరెడ్డి, సముద్రాల సుబ్రహ్మణ్యం, వెంకట్రావు, నారాయణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.